క్లుప్తంగా

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

కమలాపూర్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, అంబాలలోని ఆగ్రోస్‌లో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఏఓ జాలి లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ భూముల్లో భూసారం పెంపొందించుకునేందుకు మండలానికి మొదటి విడతగా 310 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని, 30 కిలోల బస్తాకు రూ.2,790 అని, అందులో 60 శాతం సబ్సిడీ రూ.1,674 పోను మిగతా రూ.1,116 రైతులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 30 కిలోల విత్తనాలు రెండున్నర ఎకరాలకు సరిపోతుందని కావాల్సిన రైతులు పట్టాదారుపాసు పుస్తకం జిరాక్స్‌తో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, అంబాలలోని ఆగ్రోస్‌లో అందించి విత్తనాలు పొందాలని తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి


మధుకుమార్ (ఫైల్)

కమలాపూర్ : మండలంలోని కన్నూరుకు చెందిన నాగపురి మధుకుమార్ (38) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మధుకుమార్ గత నెల 24వ తేదీన మర్రిపల్లిగూడెంలోని తన అత్తగారింటికి ఎల్లమ్మ బోనాల పండుగకు వెళ్లాడు. తిరిగి కన్నూరుకు వస్తున్న క్రమంలో మర్రిపల్లిగూడెం శివారులో గుండేడు వైపు వెళ్లే మార్గంలో ఎదురుగా అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో మధుకుమార్‌తో పాటు అతని కుమారుడు సాయి నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మధుకుమార్‌ను హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని భార్య కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం



శాయంపేట : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాయంపేటలో ప్రెస్‌క్లబ్ నూతన భవన నిర్మాణానికి సహకారం ఉంటుందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

గోసంగి సంఘం అధ్యక్షుడిగా కేదారి



వేలేరు : గోసంగి సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు ఆ సంఘం నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా మునిగడప కేదారి, ఉపాధ్యక్షుడిగా మూడపు నరేష్, ప్రధానకార్యదర్శిగా జూల భద్రయ్య, కోశాధికారిగా పూర్ణ చందర్, సంయుక్త కార్యదర్శిగా సంపత్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కేదారి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

మైక్‌సెట్ బహూకరణ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి గ్రామ ఎల్లమ్మతల్లి గుడికి బీజేపీ హనుమకొండ జిల్లా కార్యదర్శి మాచర్ల కుమారస్వామిగౌడ్ ఆదివారం మైక్ సెట్ బహూకరించాడు. దీంతో గ్రామ గౌడ కులసంఘం పెద్దలు, గ్రామస్తులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా ప్రసాద్

వేలేరు : బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్‌గా మండల కేంద్రానికి చెందిన జోగు ప్రసాద్‌ను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిద్రిస్తున్న నిఘానేత్రాలు

- పనిచేయని సీసీ కెమెరాలు
- ఇటీవల జరిగిన వరుస చోరీలు
- పట్టించుకోని అధికారులు

వేలేరు : 'ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరూ సహకరించి ముందుకు రావాలి' అని పోలీసు అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సీసీ కెమెరాలను ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉంది కానీ వాటి నిర్వహణను గ్రామపంచాయతీలకు అప్పగించగా నిరుపయోగంగా మారాయి.

14 గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు

మండలంలోని 14 గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గతంలో పోలీసులు సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించి దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ గ్రామపంచాయతీలకు అప్పగించారు. కానీ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో


అంబేడ్కర్ సెంటర్ వద్ద పనిచేయని సీసీ కెమెరాలు


ఎస్సీ కాలనీలో..

నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణలో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ సీసీ కెమెరాలు, వాటి వైర్లను తొలగించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణం పూర్తి అయిన వెంటనే మళ్లీ బిగిస్తామని చెప్పినా ఇప్పటి వరకు బిగించలేదు. అలాగే వివిధ గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాల వైర్లను కట్ చేయడంతో ఇటీవలే వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. పీచర క్రాస్ రోడ్డు వద్ద ఉన్న టీ స్టాల్‌లో వరుసగా మూడుసార్లు దొంగలు బీభత్సం సృష్టించి సమారు రూ.లక్ష విలువగల సామాన్లు, నగదు అపహరించారు. రెండు నెలల క్రితం బండతండా గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్రాలీ టైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగించారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో అక్రమ వ్యాపారులకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని పలువురు చర్చించుకుంటున్నారు. మండలంలో ఎదైనా సంఘటన జరిగితే పోలీసులు ప్రైవేట్ దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని సీసీ కెమెరాలను మరమ్మతు చేయించాలని, ప్రధానకూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెండుసార్లు దొంగలు పడ్డారు



బతుకుదెరువు కోసం పీచర క్రాస్ రోడ్డు వద్ద టీ స్టాల్ పెట్టుకున్నాను. కొన్ని నెలల క్రితం షాప్‌లో వరుసగా రెండుసార్లు దొంగలు పడి సూమారు రూ.70 వేల వరకు సామాను, గ్యాస్ సిలిండర్, నగదు అపహరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలు పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

- దార దినేష్, టీ స్టాల్ యాజమాని

సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం



మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. వివిధ కారణాలతో కొన్ని పనిచేయడం లేదు. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ తొలగించాడు. త్వరలోనే అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను రిపేరు చేయించి పని చేసేవిధంగా చర్యలు తీసుకుంటాం.

- డి.హరిత, ఎస్సై


నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎస్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. భవానీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇందిరానగర్, అశోక కాలనీ, వికాస్ నగర్, ఎన్జీవోస్ కాలనీ రోడ్డు, సర్క్యూట్ హౌస్ రోడ్, యాదవనగర్, కృష్ణా కాలనీ, దుర్గా కాలనీ, గౌతమినగర్, రెడ్డిపురం, రెడ్డికాలనీ, పెట్రోల్ పంపు, రాయపుర, లోటస్ కాలనీ, ఆర్‌ఆర్ గార్డెన్స్ ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు, చైతన్యపురి కాలనీ, బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ, స్నేహనగర్, శ్రీనగర్ కాలనీ, రాఘవేంద్ర నగర్, క్యాథలిక్ చర్చి, బ్రాహ్మణ వాడ, ప్రశాంతి హాస్పిటల్, నాగుల వీధి, కమ్యూనిటీ హాల్, ఇమ్లీపుర, పింజర్ల, కాజీపేటలోని విష్ణుపురి, సోమిడి, వాటర్ ట్యాంక్, శివారు గ్రామాలు రాంపేట, తరాలపల్లి ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమకొండ బస్‌స్టేషన్, హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు మడికొండలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: మరమ్మతుల కారణంగా చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం 3.30గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. దేవన్నపేట, అలియా తండా, మధుతండా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈమేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

30 మూగజీవాల మృత్యువాత



ఐనవోలు : 30 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వనమాల కనపర్తి గ్రామానికి చెందిన జక్కుల సమ్మయ్య, జక్కుల రవి, జక్కుల అశోక్, జక్కుల ప్రశాంత్ రోజుమాదిరిగానే గొర్లు, మేకలను మేపేందుకు అడవికి వెళ్లారు. మూగజీవాలను మేపుకుని తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. అకస్మాత్తుగా 28 గొర్లు, 2 మేకలు మృత్యువాత పడ్డాయి. సుమారు 5 లక్షల విలువ చేసే మూగజీవాలు మృతిచెందాయని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌కు సన్మానం

హన్మకొండ: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌ను బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి సన్మానించారు. హనుమకొండ సుబేదారిలో రియాజ్‌ను ఆయన ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. బీసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

దంపతుల శరీర దాన అంగీకారం

హసన్‌పర్తి: తమ మరణాంతరం శరీర దానం చేయడానికి వృద్ధ దంపతులు ముందుకు వచ్చారు. ఈ మేరకు పార్థివదేహ అంగీకార పత్రాలను తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ సభ్యుల ద్వారా కేఎంసీకి అందించారు. నగరంలోని గోపాలపురానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కొండపర్తి ఉమాదేవి – నరసింహాచారి దంపతులు సమాజ హితం కోరి గొప్ప సంకల్పంతో మరణాంతరం తమ పార్థివ దేహాలను మెడికల్ కళాశాల విద్యార్థుల వైద్య విద్య నిమిత్తం ఇవ్వాలని నిర్ణయించారు. ఈమేరకు అసోసియేషన్ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో అసోసియేన్ సభ్యులు ఆ దంపతుల నుంచి అంగీకార పత్రాలు సేకరించారు. అనంతరం కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్ దాస్‌కు అందజేశారు. ఆ ఆదర్శ దంపతులను


అంగీకార పత్రాలను ప్రదర్శిస్తున్న సభ్యులు

స్ఫూర్తిగా తీసుకుని శరీర దానం చేయడానికి దాతలు ముందు రావాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ నేత్ర, అవయదాన అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతరించిపోయే దుస్థితిలో బీఆర్‌ఎస్ పార్టీ

కాజీపేట: రాష్ట్రంలో తమకు ఎదురులేదనే స్థాయి నుంచి నామరూపాలు లేకుండా అంతరించిపోయే దుస్థితికి బీఆర్‌ఎస్ పార్టీ చేరిందని కాంగ్రెస్ పార్టీ పట్టభద్రు ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఆరోపించారు. కాజీపేట 61వ డివిజన్ తెలంగాణ చౌరస్తాలోని జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం కేయూ జేఏసీ నేత డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రులు తనను ఆదరించి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో రజనీకాంత్, తాళ్లపెల్లి సురేష్, బండి శ్రీనివాస్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి యోగా దోహదం


పిల్లలతో యోగా గురువు అశోక్ ఆర్య

ఖిలా వరంగల్: మానసిక వికాసానికి యోగా జీవం లాంటిదని యోగా గురువు అశోక్ ఆర్య తెలిపారు. తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను పూజించాలని సూచించారు. బాల సంస్కారణ శిబిరంలో భాగంగా వరంగల్ శంభునిపేటలోని హనుమాన్ మందిరంలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో యోగాసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరిలో అద్భుతమైన శక్తి ఉంటుందని, ఆ శక్తిని బయటికి తీయడానికి యోగాసనాలు ఉన్నాయని వివరించారు. అనంతరం తల్లిదండ్రులకు పాదాభివందన సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవులపల్లి దయాకర్, బండారి రవిబాబు, కందగట్ల శ్రీరామ్, కొడిపాక రమేష్, శరత్‌బాబు, వినయ్, రాహుల్, కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీని 40వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీర్జా అక్తర్ అధ్యక్షతన ఆదివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా బెజ్జంకి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా కంకల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ఎక్కులదేవి రమేష్, సహాయ కార్యదర్శిగా రాగి వేణుగోపాల్, కోశాధికారిగా గౌడ రఘు, సహాయ కోశాధికారిగా గౌడ తిరుపతి, పూజారిగా పిల్లలమర్రి హరిహర, ఆలయ ఫౌండర్‌గా పిల్లలమర్రి బాలాజీ, ఆర్గనైజర్లుగా ప్రశాంత్, చంద్రశేఖర్, శ్రీనివాసచారి, కృష్ణ, ముఖ్య సలహాదారులుగా పోతరవేణి రాజన్న, ఎక్కులదేవి, పరమేశ్వర్, మొగిలిశెట్టి అనిల్‌కుమార్, కొమ్మిని రాజేందర్, దేవేందర్, కార్యవర్గ సభ్యులుగా శ్యామ్, వెంకటేశ్వర్లు, రాంగోపాల్ వర్మ, కిషన్, కర్నాకర్, ప్రకాశ్, రాజు, రవి ఎన్నికయ్యారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అండగా అసోసియేషన్

హన్మకొండ: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అండగా ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉంటుందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి అసోసియేషన్ కట్టుబడి ఉందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు.

నూతన భవనం నుంచి తహసీల్ సేవలు



దామెర : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించినట్లు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి తెలిపారు. ప్రస్తుతంఉన్న కార్యాలయం నుంచి రికార్డులను, బీరువాలను, ఫర్నీచర్‌ను ఆదివారం తరలించామన్నారు. ఇంతకుముందు స్థానిక పీహెచ్‌సీలో తహసీల్దార్ సేవలు కొనసాగించామని, నూతన భవనం పూర్తికావడంతో అందులోకి మారినట్లు పేర్కొన్నారు. సోమవారం నూతన భవనం నుంచి సేవలు అందిస్తామని తెలిపారు.

శ్వేతార్కలో సత్యనారాయణ వ్రతాలు


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న మహిళలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని రామ సహిత సత్యనారాయణ స్వామికి భక్తులు ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతం జరిపించారు. పరివార సమేత సత్యనారాయణుడికి పంచామృతాలు, నవరసాలతో అభిషేకం చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఐనవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో పండితులు వ్రతాలు చేయించారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు మహాన్నదానం చేశారు.

అవెన్యూ ప్లాంటేషన్‌లో మంటలు


అగ్నికి కాలిపోతున్న వృక్షాలు

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామ శివారులో గల అవెన్యూ ప్లాంటేషన్‌లో మంటలు చెలరేగాయి. రోడ్డు ప్రక్కన పడేసిన కంకిబెండ్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు దగ్ధమయ్యాయి. గతంతో కూడా అవెన్యూ ప్లాటేంషన్‌లో మొక్కలు కాలిపోయిన విషయం తెలిసిందే. హరితహారం కార్యక్రమంలో భాగంగా లక్షలాది రూపాయల నిధులతో చేపడుతున్న అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు కాలిపోతుండడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి


కండువా కప్పి ఆహ్వానిస్తున్న లింగయ్య

ఐనవోలు : పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు చేపట్టాలని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి కాడబోయిన లింగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను మండల కమిటీ సభ్యుడు కొంకాల నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశ కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన సుందరయ్య పేద, కష్ట జీవుల రాజ్యం కోసం పరితపించారన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా వివిధ పార్టీల నుంచి సుమారు 10 కుటుంబాలు సీపీఎంలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాదాసి ప్రభాకర్, మడిగె నాగరాజు, సుధాకర్‌గౌడ్, గుంశావలి, ఏసిరెడ్డి రాజిరెడ్డి, ఆవునూరి వెంకటాద్రి ఉన్నారు. అదేవిదంగా ముల్కలగూడెం, ఐనవోలు, వెంకటాపూర్, గర్మిళ్లపల్లి గ్రామాల్లో సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నారాయణరెడ్డి, బాబురావు, రాంకుమార్, నాగరాజు, గోపాల్‌రావు, మహేందర్, మానస, పోచమ్మ, సరోజన పాల్గొన్నారు.

జనావాసాల్లో నిలిచిన వరదనీరు


కాలనీలో నిలిచిన నీటిని చూపుతున్న మహిళలు


జారిపడి గాయపడిన వృద్ధురాలు

శాయంపేట : మండల కేంద్రంలోని మాటేటి మణెమ్మ వీధిలో సీసీ రోడ్డు, సైడ్‌కాల్వ లేకపోవడంతో వరదనీరు ఇంటిముందే నిలుస్తుందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కురిసిన వర్షానికి వరదనీరు నిలిచి ఉండగా కొమురాజు కొమరమ్మ అనే వృద్ధురాలు జారిపడడంతో స్వల్ప గాయాలు అయినట్లు తెలిపారు. సైడ్ కాల్వ, సీసీ రోడ్డు లేకపోవడంతో తేలికపాటి వర్షానికే వీధులు చెరువులను తలపిస్తున్నాయని కాలనీవాసులు మణెమ్మ, లక్ష్మి, సౌందర్య, సునీత, చంద్రకళ, రాజమణి తెలిపారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

వైభవంగా పోచమ్మతల్లి బోనాలు


కమలాపూర్ : బోనాలతో వెళ్తున్న మహిళలు

కమలాపూర్ : రేణుకాఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం గీతపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో పోచమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించి పోచమ్మతల్లి ఆలయానికి తరలివెళ్లారు. బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు జేరిపోతుల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పబ్బు కొమురయ్యగౌడ్, కోశాధికారి బాలసాని రమేశ్‌గౌడ్, డైరెక్టర్లు తోడేటి సదానందం గౌడ్, జక్కు రాజుగౌడ్, పరకాల వీరగౌడ్, దొనికెల కుమారస్వామిగౌడ్, పబ్బు రాజుగౌడ్, మేడిపల్లి రాములుగౌడ్, కారోబార్ పెరుమాండ్ల గోపాల్‌గౌడ్, గౌడ మహిళలు, గౌడకులస్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు కుమార్, శ్రీనివాస్, అనిల్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



దామెర : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మెంతుల రాజు పిలుపునిచ్చారు. మండలంలోని పులుకుర్తిలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఈనెల 27న జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డికి మెదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రశ్నించే గొంతును గెలిపించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దండు రాజు, సానబోయిన కిశోర్, కిషన్, కిరణ్ తదితరులు ఉన్నారు.

మల్లన్నను ఆశీర్వదించాలి



శాయంపేట : వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని 1,908 మంది ఓటర్ల జాబితాను మండల అబ్జర్వర్ మహ్మద్ రాజ్‌మహ్మద్ బుచ్చిరెడ్డికి అందజేశారు. పదవుల కోసం పాకులాగే బీఆర్‌ఎస్ నాయకుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వార్థం వలనే ఉపఎన్నిక వచ్చిందని ఆరోపించారు. పట్టభద్రులు అందరూ కాంగ్రెకు ఓటువేసి గెలిపించాలని కోరారు.